# సూర్య

17వ

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా

కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,5 ఆగస్టు 2024




## పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలలో అందరూ పాల్గొనాలి

– డాక్టర్ బిఈవిఎల్ నాయుడు




**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, యూత్ రెడ్ క్రాస్ వింగ్ వాలంటీర్లు కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో ఆల్ ఈజ్ వెల్ సంస్థ ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ,యూత్ రెడ్ క్రాస్ వింగ్ వాలంటీర్లు 80 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు.

ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేస్తున్న ఆల్ ఈజ్ వెల్ సంస్థ ఫౌండర్ చైర్మన్ ఎన్ కిషోర్ కుమార్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్య విద్యార్థులను డాక్టర్‌పివి కృష్ణారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఐగౌరీ ప్రియ మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.

# గరికిపాటి డవలపర్స్

# బరితెగింపు




## నోటీసులు..గీటీసులు జాన్తా నై !


అక్రమ వెంచర్లపై శాశ్వత హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన ఇన్‌ఛార్జి కార్యదర్శి


- మీకేంటి మేము సమాధానం చెప్పేది
- జిల్లా కలెక్టరైనా..పంచాయితీ కార్యదర్శి అయినా మాకు ఒక్కటే
- ఓ డిపివో స్థాయి అధికారికి లక్షల్లో మామూళ్ళు ఇచ్చా.. మమ్మల్ని పీకేది ఎవరు ?
- అంతా ఆ డిపివో స్థాయి అధికారి చూసుకుంటాడు
- ఎన్ని నోటీసులు ఇచ్చినా నాకు లెక్క కాదు
- ఇదీ గరికిపాటి డవలపర్స్ ధీమా..!
- కూల్చివేతకి జంకు ఎందుకు?
- సెలవు పై ఉన్న అవినీతి కార్యదర్శిపై చర్యలు లేవి..!

రంగంపేట మండలం వడిశలేరు గ్రామ పంచాయితీ పరిధిలో గరికిపాటి డవలపర్స్‌వారు గ్రీన్ విలేజ్ పేరుతో సుమారు 40 యకరాల్లో అక్రమంగా నిబంధనలకు వ్యతిరేకంగా ఫామ్ ల్యాండ్ వెంచర్ ను వేశారు... రుడా, రెరా అనుమతులు లేకుండా అక్రమాలకు తెగబడ్డారు. అందమైన బ్రోచర్లు, ఆకర్షణీయమైన వ్యాపార ప్రకటనలు, ఊకదంపుడు ప్రచారాలతో వడిశలేరులో గ్రీన్ విలేజ్ ఫామ్ ల్యాండ్ సింగిల్ బెడ్‌రూమ్ ప్లాట్ పేరుతో మోసపూరిత రియల్ దందా సాగిస్తున్నారు. 30 అడుగుల తారు రోడ్లు, సిమెంటు డ్రైన్లు, వ్యవసాయ క్షేత్రం చుట్టూ ప్రహారీ గోడ, మక్కురాళ్ళతో ప్లాట్లను ఏర్పాటుచేసి ఆయా ప్లాట్లలో నాలుగు వైపులా గోడలు నిర్మించి అందులో సింగిల్ బెడ్‌రూమ్ కాటేజీ నిర్మిస్తున్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమి గా భూమార్పిడి చేయకుండా... రుడా, రెరా అనుమతులు పొందకుండా... పంచాయతీకి 10 శాతం సామాజిక స్థలం, 40, 60 అడుగుల తారు రోడ్లు అప్పగించకుండా బరితెగించి అక్రమాలకు పాల్పడుతున్నారు. జాతీయ తెలుగు దినపత్రిక సూర్యలో ప్రచురితమైన వరుస కథనాలకు స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి పంచాయితీఅధికారులకు ఆదేశాలు జారీ చేసారు. దాంతో కదిలిన రెవెన్యూ, పంచాయితీ యంత్రాంగం సమగ్ర సర్వే నిర్వహించారు. భూమార్పిడి చేయకుండా గరికిపాటి డవలపర్స్ అక్రమాలు చేసినట్లు రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఇంచార్జ్ పంచాయితీ కార్యదర్శి సుబ్బారాయుడు గరికిపాటి డవలపర్స్ అక్రమాలపై, అక్రమ నిర్మాణాలపై తొలగింపు స్వచ్ఛందంగా చేయాలని సూచిస్తూ అక్రమ వెంచర్ తొలగించాలని చట్ట ప్రకారం మూడు నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు ఇచ్చారు. నోటీసులు జారీ చేసి 20 రోజులు పూర్తికావొచ్చినా గరికిపాటి డవలపర్స్ అధినేత గరికిపాటి వెంకటేశ్వరరావు మాత్రం జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో పని లేదని... నోటీసులు, గీటీసులు జాన్తా న్కై తమ వెనుక సెలవు పై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా పంచాయితీ అధికారి స్థాయి అధికారి ఉన్నారని... అంతా వాళ్లు చూసుకుంటారనే ధీమాతో ఉన్నారు. పెద్ద మొత్తంలో సెలవు పై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి,డిపివో స్థాయి అధికారులు తీసుకుంటే.. ఇప్పుడు ఈ అడ్డంకులు ఏంటని, వేధించడమేమిటని ప్రశ్నిస్తున్నాడు. వడిశలేరు గ్రామంలో గరికిపాటి డవలపర్స్ అక్రమాలలో పంచాయతీ కార్యదర్శి, జిల్లా పంచాయితీ అధికారుల హస్తం ఉన్నట్లు పరోక్షంగా గరికిపాటి వెంకటేశ్వరరావు తేల్చి చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కారు చవకగా పొలాలు కొని.. అక్రమంగా వెంచర్ వేసి రూ.కోట్లలో వ్యాపారం చేస్తూ దర్జాగా కోట్లు గడించిన అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా డిపివో దాసరి రాంబాబు మౌనం వహించడం వెనుక పరమార్థమేమిటో అంతుపట్టడం లేదని ప్రజలు మొత్తుకుంటున్నారు.. గరికిపాటి డవలపర్స్ బరితెగించిన అక్రమాలపై కొరడా జులిపించని పంచాయతీ జిల్లా స్థాయి అధికారులు తీరుపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం..

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

- మిగతా 2 లో..


గ్రీన్ విలేజ్ పేరుతో అక్రమ నాన్ లేఅవుట్


గరికిపాటి డవలపర్స్ ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా అక్రమ వెంచర్ వేయడంపై విచారణ చేస్తున్న రంగంపేట తహశీల్దార్, విఆర్‌వోలు


అక్రమ వెంచర్‌లో తారు రోడ్లు, సిమెంటు డ్రైన్లు, ప్రహారీ గోడలు పరిశీలిస్తున్న డిఎల్‌పీవో అధికారిణి

## నిరుద్యోగ యువతకు డీఎస్సీ మరియు టెట్ పరీక్షలకు ఉచితంగా శిక్షణ

– రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్




**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** నిరుద్యోగ యువత డీఎస్సీ మరియు టెట్ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఆదివారం ఉదయం రామచంద్రాపురంలోని శ్రీ బుచ్చిరాజు కళ్యాణమండపం నందు స్నేహితుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మీట్ ద ప్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురంలోని మీడియా ప్రతినిధులతో కలిసి కేకును కట్ చేసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉన్న నేపథ్యంలో దీనిని గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఉద్యోగ నియామకమైనడీఎస్సీమీదతొలి సంతకం చేశారని, ఐదవ సంతకం నైపుణ్య గణన మీద చేశారని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యను నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకొచ్చే విధంగా అన్ని చర్యలను చేపడు తోందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కూడా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే కార్యక్రమం చేపడుతున్నామని దానిలో భాగంగా రామచంద్రపురం వివిఎస్ఎం కాలేజీలో నిర్వహించిన జాబ్ మేళాలో ఇప్పటివరకు 850 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం ఎంతో శ్రమ ఖర్చుతో కూడిన విషయమనిఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని రామచంద్రపురం వి.ఎస్.ఎం.కాలేజీలోడీఎస్సీ మరియు టెట్ పరీక్షలకు సంబంధించి ఉచితకోచింగ్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన బ్రౌచర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ కోచింగ్ సెంటర్లో జనరల్ నాలెడ్జ్, మనో విజ్ఞాన శాస్త్రం, ఇంగ్లీష్, తెలుగు,గణితం,సైన్స్, సోషల్‌లో మంచి ప్రావీణ్యత కలిగిన బోధన సిబ్బందితో శిక్షణ ఇస్తామన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యత కలిగిన స్టడీ మెటీరియల్ అందించి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలను నిరుద్యోగ యువత అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఆగస్టు 11 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని ఆగస్టు13నుంచిశిక్షణ తరగతుల ప్రారంభ మవుతాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వివరాలకు 8096523666 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. మీడియా ప్రతినిధులకు త్వరలో ఇళ్ల స్థలాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## సోకులేరు వాగులో ఆరడుగుల ఇసుక మేట తీయించిన జమాల్ ఖాన్





**చింతూరు,మేజర్‌న్యూస్ :** గత 15రోజుల నుంచి వర్షాలతో వరదలు రావడంతో ముకునూరు వద్ద సోకులేరు వాగు ప్రొంగి ప్రవహించినది. దానితో చింతూరు మండలానికి మరియు వర రామచంద్రపురంకి రహదారి సౌకర్యం లేకపోయేసరికి కొన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురైనారు. శనివారం సాయంత్రం సోకులేరు వాగు తగ్గడంతో రహదారికి ఆరడుగుల మేర ఇసుక మేట వేసింది. ఇబ్బందికి గురైన కొన్ని గ్రామాల ప్రజలు ఆదివారం ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్‌ను కలసి రహదారికి అడ్డుగా ఉన్న ఆరడుగుల ఇసుక మేటను తొలగించవలసిందిగా కోరారు. వెంటనే తన దగ్గర ఉన్న జెసిబిలను పంపించి అడ్డుగా ఉన్న ఇసుక మేటను తొలగించారు. ముకునూరు గ్రామ ప్రజలు జమాల్ ఖాన్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్నేహితుల దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థుల రీయూనియన్



**అల్లవరం, మేజర్ న్యూస్ :** ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా అల్లవరం జిల్లా పరిషత్ హై స్కూల్లో 1987- 88 సంవత్సరంలో చదువుకున్న పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులందరూ అల్లవరం గణపతి పబ్లిక్ స్కూల్లో సమావేశమయ్యి స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈ బ్యాచ్ కి చెందిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ స్నేహానికి కులం గాని, మతంగాని, ప్రాంతంగాని అడ్డురాదని, స్నేహానికి ఉన్న విలువ ప్రపంచంలో దేనికి లేదని అన్నారు. నిజమైన స్నేహితుడు ఆపదలో ఉన్న స్నేహితుడిని ఆదుకుంటాడని, అదే నిజమైన స్నేహమని అన్నారు ఒకరికొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకొని స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మంగళంపల్లి బాల సుబ్రహ్మణ్యం, కంకిపాటి గణపతి, రుద్రరాజు సీతారామరాజు, బండి గుప్తాపు శ్రీనివాసరావు, అడపా శ్రీనివాసరావు, కంచర్ల శ్రీనివాసరావు, కంకిపాటి శ్రీను, అడపా నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, వెన్నపు ఏడుకొండలు, కుడిపూడి బాల గంగాధర తిలక్ మొదలగువారు పాల్గొన్నారు.

## వేంద్ర వెంకట రామమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి దుర్గేష్



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం ముక్కామల టీడీపీ గ్రామ అధ్యక్షులు వేంద్ర వెంకట్రామూర్తి సోదరుడు వేంద్ర భాస్కరరావు కొద్దిరోజుల క్రితం గుండెపోటుతో మరణించడం జరిగింది. ఆ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆగస్టు 4వ తేదీ ఆదివారం వేంద్ర వెంకట రామమూర్తిని వేంద్ర భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వెంట మండల జనసేన పార్టీ అధ్యక్షులు పెప్పర రవికుమార్ తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు అతికాల కృష్ణమ్మ తెదేపా జనసేన నాయకులు నల్ల సురేంద్ర రేలంగి రాజేష్ జక్కంశెట్టి మహి మరియు ఇతర తెదేపా జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్నేహానికి హద్దులు లేవు - వయసుతో పనిలేదు



**అనపర్తి, మేజర్ న్యూస్ :** స్నేహానికన్న మిన్న లోకాన లేదురా.. స్నేహానికి లేవోయ్ హద్దులు స్నేహానికి చెలికాడా.. అని కవుల కలం నుంచి జాలువారిన అక్షర సత్యాల లాగే స్నేహానికి కుల మత వర్గ వయసు భేదం లేదు. అన్నట్లుగానే నేటి సమాజంలో స్నేహ భావం విరజిల్లుతోంది.. స్నేహ భవానికి సరైన నిర్వచనంగా శ్రీకృష్ణులు బలరామకృష్ణుల బంధాన్ని,యాదవరాజుగాను,కురుక్షేత్ర సంఘంలో అర్జునుడి రథ సారథియైన పాండవ పక్షపాతిగా శ్రీకృష్ణుడు చూపించిన స్నేహబంధంలను మనకు పురాణాలు స్నేహానికి గుర్తుగా స్ఫూర్తిగా నిలుస్తాయి అటువంటి శ్రీకృష్ణ పరమాత్ముని సాక్షిగా స్నేహితుల దినోత్సవ సందర్భంగా ఆదివారం మండలంలోని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని రామవరం గ్రామంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, గ్రామ ఉపసర్పంచ్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి చేతికి వయస్సుతో సంబంధం లేకుండా చిన్నారులు ఫ్రెండ్ షిప్ బాండ్లు కట్టారు.

## కేరళ వరద బాధితుల సహాయార్థం సిపిఎం నిధి సేకరణ

– ప్రజల నుండి విశేష స్పందన





**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కేరళలో సంభవించిన వరద బీభత్సంతో భారీగా నష్టపోయిన ప్రజలకు ముఖ్యంగా వయనాడు ప్రాంత బాధితులను ఆదుకునే నిమిత్తం సహాయ నిధి సేకరణ చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా కాకినాడ రూరల్ మండల కమిటి ఆధ్వర్యంలో రెండు రోజులుగా పార్టీ కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లారు. సర్పవరం జంక్షన్, ఇంద్రపాలెం భగత్ సింగ్ విగ్రహం సెంటర్లో విరాళాల సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వ శేషబాబ్జి, కాకినాడ రూరల్ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ముఖ్యంగా వయనాడ్ లో కురిసిన అతి వర్షాలు కారణంగా కొండ చరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన బాధితుల కుటుంబాలను ఆదుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. దాదాపుగా 300 మంది పైగా మరణించారన్నారు. కేరళలో వరద బీభత్సం వల్ల గ్రామాల మొత్తం వరద నీటితో మునిగిపోయి అనేక ఇల్లు కట్టుకుపోయి సర్వం కోల్పోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించి కేరళ ప్రజానీకాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేరళలో సిపిఎం పార్టీ, ఇతర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల కార్యకర్తలు యావత్తూ ప్రాణాలకు తెగించి అనేక సేవా కార్యక్రమాల్లో నిమగ్నమైనారని, అదే స్ఫూర్తితో ఆంధ్ర రాష్ట్రంలో పార్టీ చురుకైన పాత్ర పోషిస్తూ ఆర్థిక సహాయం అందివ్వడానికి నిర్ణయించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు మానవత దృక్పథంతో సహాయ కార్యక్రమాలు చేసి సర్వం కోల్పోయిన వాళ్లకి చేయూతనివ్వాలన్నారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ ప్రజానీకం కేరళ వరద బాధితులకు అండగా ఉంటామని రూ.18,456 లు విరాళాలు ఇచ్చారన్నారు. వారికి సిపిఎం పార్టీగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కృషి ఇంకా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కాకినాడ రూరల్ ఇంద్రపాలెం శాఖ కార్యదర్శి చిట్టూరి విజయ్ కుమార్, నాయకులు చెక్కా రమణి, పెద్దింశెట్టి రామకృష్ణ, తొట్టిపూడి రాజా, మేడిశెట్టి వెంకటరమణ, వాసంశెట్టి చందర్రావు, అంకం సుబ్రహ్మణ్యం, యు.సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాసు, శ్రీను, రాజేష్, విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలపై సీఎం చంద్రబాబుకు వినతి

– మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి



కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : కాకినాడ రూరల్ మండలంలోని ఆరు గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతి పత్రాన్ని అందజేసినట్లు మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. స్థానిక వలసపాకలలో రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ ప్రభృతులు అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ నగరపాలక సంస్థకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించను న్నందున విలీన ప్రక్రియ సాధ్యసాధ్యాలపై పరిశీలిస్తామని అన్నారు. దీనిపై హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన ప్రజాప్రతినిధుల తీర్మానం ప్రకారం విలీనం చేయాలా లేదా అనేది నిర్ణయించాల్సి ఉందని చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయమై పార్టీ అధ్యక్షులైన పల్లా శ్రీనివాస్‌ను కలవాలని చంద్రబాబు సూచించగా తాము ఆయనను కూడా కలిసి చర్చించామని సత్యనారాయణ మూర్తి తెలిపారు. మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ రమణయ్యపేట తదితర గ్రామాలకు గత 13 సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించనున్నందున అభివృద్ధి కుంటుపడిందని ఈ విషయమై స్పందించిన మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

## వెంకటేశ్వరరావు షష్టిపూర్తి కార్యక్రమానికి హాజరైన కందుల దుర్గేష్



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి సన్నిధిలో ప్రైమ్ నైన్ సీఈఓ పైడికొండ వెంకటేశ్వరరావు షష్టిపూర్తి సందర్భంగా హరిహరసదన్ కొండపై లలిత కళ్యాణ్ మండపంలో కార్యక్రమంకు మంత్రి కందులు దుర్గేశ్ హాజరయ్యారు. ప్రత్తిపాడు నియోజవర్గం జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్య బాబు, ఆకుల రామకృష్ణ, జనసేన నాయకులు గొర్లి నాగేశ్వరరావు, జ్యోతుల శ్రీను, దాసరి శేషారావు, బండారు రామారావు, నల్లల రామకృష్ణ, దేవస్థానం సిబ్బంది దామెర్ల కృష్ణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.



## వైద్య శిబిరం ఏర్పాటు

**కూనవరం, మేజర్ న్యూస్ :** గౌరవ ప్రాజెక్ట్ ఆఫీసర్ సూచనలతో డిప్యూటీ డీఎం & హెచ్‌వో, డిఓంవొ, ఏఎంవో ఆధ్వర్యంలో కూనవరం మండలం పరిధిలో ఉన్న గుట్టలలో వైద్య శిబిరం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ వైద్య శిబిరాలు, కారుమానుకొండ, పాత కారుమానుకొండ, గబ్బిలాలగొంది, చింతగండి మొదలగు గ్రామాలలో వైద్య శిబిరం పెట్టటం జరిగింది. వీటితో పాటుగా ఇంటింటికి తిరిగి సర్వే కూడా చేయటం, ప్రతి ఒక్కరికి రక్తపుతాలు సేకరించి, జ్వరాలు గుర్తించి మందులు ఇవ్వటం జరిగింది. జ్వరాలు ఉన్న వారికీ మరియు ఇతర వ్యాధులు గుర్తించి సుమారు 135 మందికి మందులు ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటూరు వైద్యాధికారి శ్రీనివాస్ మూర్తి, ఏఎంవో శ్రీనివాస్ రాజు, సూపర్‌వైజర్లు, హెచ్‌ఏలు, ఆశాలు పాల్గొన్నారు.

# ఆదివాసీ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం అల్లూరి జిల్లా, రంపచోడవరం జిల్లా స్థాయి కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ ఎన్నికలలో ప్రస్తుతం తాత్కాలిక ప్రాతిపదికన జిల్లా స్థాయి కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా పరిధిలోని 22 గిరిజన మండలాల్లో ఉన్న ఆదివాసీ ప్రజల బాగోగులు, సంరక్షణ నిమిత్తం చాలామంది ఉద్యోగులు విధుల్లో ఉన్న దృష్ట్యా వారి కోరిక మేరకు తాత్కాలిక ఎన్నికలు జరిగినట్లు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు తెలిపారు.

కాగా ఈ సమావేశానికి మొత్తం 22 మండలాలు నుండి 12 ఆదివాసీ తెగలకు చెందిన ఉద్యోగ, ప్రజా, విద్యార్థి నాయకులు 100 మందికి పైగా హాజరై ఆదివాసీ సంఘం నాయకులను ఎన్నుకోవడం జరిగింది.

ప్రధానంగా ఆదివాసీ (గిరిజన ) ఉద్యోగుల సంక్షేమ మరియు సాంస్కృతిక సంఘం జిల్లా అధ్యక్షులుగా కత్తుల ఆదిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కురసం ఫకీరు దొర, జిల్లా కోశాధికారిగా తాడే రాజబాబు, కుంజం అగ్గి దొర, మట్ల కృష్ణారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొరగ పొట్టి దొర, జిల్లా ఉపాధ్యక్షులుగా గంటిమళ్ళ సత్యనారాయణ, పచ్చుకూరు అర్జునుడు, కుంజం వెంకన్న దొర, జిల్లా



సహాయ కార్యదర్శులుగా విండెల కృష్ణారావు, బేలెం నూకరాజు, నైని చెల్లా రెడ్డి, కానెం నానిబాబు, కొమరం సూర్య చంద్రం దొర, జిల్లా గౌరవ అధ్యక్షులుగా బొగ్గుల కాటం రెడ్డి, పందుల కామరాజు, పల్లాల లింగారెడ్డి, కడబాల రాంబాబు, జిల్లా గౌరవ న్యాయ సలహాదారులుగా పరిసిక ప్రకాశరావు, కోసు రామకృష్ణ, విండెల.సామయ్య, జిల్లా ప్రచార కార్యదర్శులుగా కొమరం రాంబాబు, బొగ్గుల కృష్ణ కుమారి, సాంస్కృతిక కార్యదర్శిగా బంధం బాబూరావుదొర,జిల్లా గౌరవ సలహాదారులుగా చెక్కా వెంకట నారాయణ, సమర్థ కృష్ణ, జిల్లా సంఘం ముఖ్య, ప్రధాన సలహాదారుగా కంగల పోతురాజును ఎంపిక చేశారు.ఆదివాసీ ప్రాంత చట్టాలు, రిజర్వేషన్‌లు,హక్కులపరిరక్షణకు ఆదివాసీ ఉద్యోగులనందరినీ తప్పకుండా ప్రతీ ఒక్కరినీ భాగస్వామ్యం చేసి ఈ ఆదివాసీ ఉద్యోగుల సారథ్యంలో మొత్తం జిల్లా పరిధిలోని 22 మండలాలలో ఉన్న 12 ఆదివాసీ తెగల ప్రజలను, విద్యార్థులను నిరంతరం పోరాటాలకు, ఉద్యమాలకు సంసిద్ధులను చేయాలని; ఆదివాసీ ప్రజల ఆశ్రయార్థం రంపచోడవరంలో నిర్మించ తలపెట్టిన "ఆదివాసీ భవన నిర్మాణాన్ని" అందరు ఆదివాసీ ఉద్యోగుల భాస్వామ్యంతో అత్యంత అతి తక్కువ కాలంలోనే పూర్తి చేయాలని; జిల్లాలో ఉన్న 12 ఆదివాసీ తెగలలో ఉన్న అత్యంత నిరుపేద తెలివైన, చురుకైన విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం 12 ఆదివాసీ తెగల ఉద్యోగులందరి తోడ్పాటుతో "విద్యా నిధి" ఏర్పాటుకు కృషి చేయాలని సమావేశం తీర్మానించింది.

ఎప్పటికప్పుడు క్రొత్తగా ఎన్నుకొన్న కమిటీల సారధ్యంలో జిల్లా పరిధిలోని 22 మండలాలలో పర్యటిస్తూ 12 ఆదివాసీ తెగల ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థుల స్థితిగతులను తెలుసుకోవడం, నిరంతర పోరాటం,ఉద్యమకార్యక్రమాలనురూపొందించడం జరుగుతుందన్నారు.

## ఆగస్ట్ 5వ తేదీ సోమవారం "మీకోసం" ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

- జిల్లా, డివిజన్, మున్సిపల్, మండల స్థాయిలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ
- కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ఆగస్ట్ 5వ తేదీ సోమవారం నుంచి "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక "మీకోసం" ద్వారా కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించ నున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. ఆగస్ట్ 5, 6తేదీల్లో ముఖ్య మంత్రినారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లతో నిర్వహిస్తున్న సమావేశంకు హాజరు కానున్న నేపథ్యంలో ఇంఛార్జి జాయింట్ కలెక్టర్ జి.నరసింహులు, ఇతర జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పిజిఆర్ఎస్)" మీకోసం యధాతథంగా నిర్వహిస్తు న్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయిలో కలెక్టరేట్ నందు,అదేవిధంగా డివిజన్, మునిసిపల్, మండల స్థాయిలో ఆయాప్రధాన కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులు ప్రజలకి అందుబాటులో ఉండి ప్రజలునుంచిఅర్జీలు స్వీకరించను న్నట్లు తెలియ చేశారు.

## నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' నిర్వహణ - ఎంపిడిఓ ఉషారాణి



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** సోమవారం పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహణ జరుగుతుందని, ఎంపిడిఓ ఎం.ఉషారాణి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధశాఖలఅధికారులు హాజరవ్వాల ని ఆమె సూచించారు. కావున మండలంలోని ప్రజలు ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కారవ్యవస్థను సద్వినియోగం చేసుకోవల సినదిగా తెలిపారు.

## గొల్లప్రోలులో ఉచిత వైద్య శిబిరం





**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గొల్లప్రోలు పట్టణ పరిధి, మెయిన్ రోడ్ జిల్లా ప్రజా పరిషత్ బాలికల కొనత పాఠశాలలో ఆదివారం కాకినాడ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ప్రజా వైద్య శిబిరం జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర డిప్యూటీ సీఎం, పిఠాపురం శాసనసభ్యుడు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరానికి పిఠాపురం నియోజకవర్గంలో ప్రత్తిపాడు, భోగాపురం, గొల్లప్రోలు, చేబ్రోలు తదితర ప్రాంతాల నుండి ఉచిత వైద్య పరీక్షల నిమిత్తం గొల్లప్రోలులో మెడికవర్ డాక్టర్లు వంశీకృష్ణ డాక్టర్ సాయికుమార్ నిర్వహించే వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో ప్రజలు చేరుకున్నారు.

ఈ సందర్భంగా స్థానిక జనసేన నాయకులు బలిరెడ్డిగంగబాబు, బస్వా చిట్టిబాబు,బసదుర్గాప్రసాద్,తలారి శ్రీనివాస్, జనసేన పార్టీ వీరాభిమాని మర్రిచిన్న,వీర మహిళలు వినుకొండ అమ్మాజీ, మొగలి కనకలక్ష్మి, సీనియర్ వీర మహిళఆదిలక్ష్మి, అక్కిరెడ్డి శ్రీనివాసు, సీనియర్ జనసేన పార్టీ నాయకులు మామిడాల సూకీర్తి సంటి, కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ మిత్ర మండలి సభ్యులు, జనసేన పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఉచిత ప్రజా వైద్య శిబిరంలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దగ్గరుండి పర్యవేక్షించారు. అలాగే పెరుగు ప్యాకెట్లు, మంచినీళ్లు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సప్లై చేశారు.

## పాత్రికేయునికి డాక్టర్ జమాల్ ఖాన్ ఆర్థిక సాయం



**చింతూరు,మేజర్‌న్యూస్:** ఎటపాక మండలం సీనియర్ పాత్రికేయులు, సూర్య రిపోర్టర్ ఏసుపాక రాంబాబు తండ్రి గురువారం స్వర్గస్తులైనారు. సూర్య రిపోర్టర్ ఏసుపాక రాంబాబు మిత్రుడు రాచూరి చంద్రశేఖర్ ద్వారా విషయంతెలుసుకొని,ఆయన స్థితిగతులు తెలుసుకొని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ జమాల్ ఖాన్ ఆదివారం ఆయనను పరామర్శించి ఆర్థిక సాయం చేయడం జరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఎటపాక సూర్య రిపోర్టర్ ఏసుపాక రాంబాబు కుటుంబానికి అండగాఉంటాననిఈ సందర్భంగా డాక్టర్ జమాల్ ఖాన్ భరోసా ఇవ్వడం జరిగింది. ఆయనకు సూర్య రిపోర్టర్ ఏసుపాక రాంబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' నిర్వహణ - ఆర్డీఓ సీతారామారావు



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** సోమ వారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాల యంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహణ జరుగు తుందని, ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. కావున డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల ప్రజలు ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవలసినదిగా తెలిపారు.

# గరికిపాటి డవలపర్స్ బరితెగింపు

## నోటీసులు..గీటీసులు...

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** వడిశలేరుగ్రామంలో గరికిపాటి డవలపర్స్ వారి గ్రీన్ విలేజ్ అక్రమ నాన్ లేఅవుట్ ఫాం ల్యాండ్ అక్రమాల విషయంలో చర్యలు తీసుకోవాల్సిన డిపివో దాసరి రాంబాబు మిన్నకుంటున్నారు. కిందిస్థాయి ఈవోపిఆర్‌డి, ఇంచార్జ్ పంచాయితీ కార్యదర్శిలకు ఆదేశాలు కూడా ఇవ్వడం లేదు. గరికిపాటి డవలపర్స్ బరితెగింపుపై ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేయడం, అక్రమ నాన్ లేఅవుట్ వెంచర్ ముందుభాగంలో కొనుగోలుదారులు మోసపోకుండాకనిపించేలా శాశ్వత హెచ్చరిక ఐరన్ బోర్డులు ఏర్పాటు ఇంత వరకుచట్ట ప్రకారం బాగానే ఉంది. డిఎల్‌పివో స్థాయి అధికారిణి సైతం తనిఖీలు నిర్వహించి,అక్రమాలు తీవ్రంగా ఉన్నాయని, చర్యలు తీసుకోవాలని, ఎక్కడా నిబంధనలు పాటించలేదని ఆ స్థాయి అధికారిణి వివరణతో కూడిన రిపోర్టుజిల్లా కలెక్టర్ ప్రశాంతి, డిపిఓ రాంబాబులకు అందించినట్లు తెలుస్తోంది. రుడా విసి బాలస్వామి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని నోటు ఆర్డర్స్ సైతం జారీ చేశారు. ఇంత తతంగం పూర్తి అయిన తరువాత గ్రీన్ విలేజ్ ఫామ్ ల్యాండ్‌లో అక్రమంగా కట్టిన కట్టడాలనుకూల్చివేయాల్సి ఉండగా..ఒక్కసారిగాఅధికారి యంత్రాంగం చేతులెత్తినట్లయింది అనేచర్చ తీవ్రంగా జరుగుతుంది.... దీనికి కారణం తెరచాటున ఎందుకు..ఏఅధికారికి ఎంత అందింది అనేదానిపైన విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు జిల్లా పంచాయితీ అధికారి ఎవరు ఏమి అనుకుంటే నాకేంటి అనే విధంగా వ్యవహరిస్తున్నట్లుగా ఉందని.. పైసా పైసా కూడబెట్టి పంచాయితీ ఆదాయాన్ని పెంచాల్సిందిపోయి వచ్చే ఆదాయం రాకుండా అడ్డుకుంటున్నారని వడిశలేరు ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చర్యలకు ఎందుకు జంకుతున్నారు...**

వడిశలేరు గ్రామంలో గరికిపాటి డవలపర్స్ బరితెగించి అక్రమంగా గ్రీన్ విలేజ్ పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా ఫాంల్యాండ్ పేరుతో రియల్ వ్యాపారం చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారు...సూర్య పత్రికలో వరుస కథనాలతో కదలిన యంత్రాంగం మొత్తం అక్రమాలపై నిగ్గు తేల్చారు. రెవెన్యూ విభాగంలో ల్యాండ్ కన్వర్షన్ చేయలేదని తేల్చారు. పంచాయితీ అధికారులు, రుడా విసి బాలస్వామి గరికిపాటి డవలపర్స్ అక్రమాలపై తీవ్రంగా స్పందించారు. కఠిన చర్యలు తీసుకోవాలని నోటీసులు జారీ చేశారు. దీంతో ఇన్‌చార్జి పంచాయితీ కార్యదర్శి సుబ్బారాయుడు మూడు నోటీసులు జారీ చేశారు. గరికిపాటి డవలపర్స్ అధినేత వెంకటేశ్వరరావు సమాధానం చెప్పకపోగా.. డిపివో స్థాయి అధికారిపై అవినీతిమరకలుజల్లుతున్నారు.లక్షలాది రూపాయలు లంచాలుగా ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే చర్యలకు ఆ అధికారి జంకుతున్నారా అనేది ప్రజల్లో చర్చ నడుస్తోంది

**అవినీతి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు ఏవి..!**

వడిశలేరు గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న సదరు పంచాయతీ కార్యదర్శి ఇప్పటికీ విధుల్లోకి చేరలేదు.గరికపాటి డెవలపర్స్ అక్రమాలకు అతనే మూలం.సుమారు40ఎకరాల విస్తీర్ణంలో అక్రమ వెంచర్ సాగుతుంటే పట్టించుకోకుండా లక్షలాది రూపాయలు లంచాలు పుచ్చుకుని చూసి చూడనట్టు వదిలేశారు.సూర్య దినపత్రికలో కథనాలు రావడంతో భయపడి,అవినీతిబండారంఎక్కడ బయటపడు తుందోనని సెలవుపై వెళ్లిపోయాడు. ఇప్పటికీ అతని పరిస్థితి ఏంటో తెలీదు. ఈ అవినీతి కూపంలోకి జిల్లా పంచాయతీ అధికారిని సైతం తాజాగా లాగి అతనికి లక్షల్లో ఇతని ద్వారా మామూళ్లు ముట్టినట్టుగా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటు సెలవు పై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి మీద గాని, అటు గరికపాటి డెవలపర్స్ అక్రమాలపై గాని చర్యలు తీసుకోవడంలో జిల్లా పంచాయతీ అధికారి చేతులెత్తేయడం వెనుక మర్మం ఏమిటో అన్నది వెలుగులోకి రావాల్సి ఉంది..

**అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి సీరియస్...**

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సీరియస్ అయ్యారు. తన నియోజకవర్గంలో రియల్ మోసాలు,అక్రమాలు సహించేది లేదని అధికారులకు చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న అక్రమ నాన్ లేఅవుట్ వెంచర్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పంచాయితీ అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాలు సైతం ఆ జిల్లా అధికారి ఎందుకు పట్టించుకోవడం లేదు అన్నది వెయ్యి డాలర్ల ప్రశ్న.. ఆ జిల్లా అధికారి మారతాడా..!గరికిపాటి డవలపర్స్ వారి గ్రీన్ విలేజ్ అక్రమాలపై కొరడా జూలిపిస్తారా వేచి చూద్దాం..!

## గోదా తిరునక్షత్ర పూజలు - 7న గోదాదేవి జయంతి





**కాకినాడ,మేజర్‌న్యూస్ ప్రతినిధి :** రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాక యావత్తు భారతదేశంలోనే అత్యంత మహిమాన్విత స్వయంభూ క్షేత్రం. లక్ష్మీనరసింహస్వామి కొండపై పుట్టలో వెలిసిన దివ్య క్షేత్రం. కాకినాడ జిల్లా పెదపూడి మండలం పుట్టకొండ. ఇదేవాల్మీకాద్రి. వాల్మీకం అంటే పుట్ట. అద్రి అంటే కొండ.అందుకే గ్రామానికి పుట్టకొండగా పేరు వచ్చింది. ఇక్కడ వేంచేసిన గోదాదేవి అమ్మవారితిరు నక్షత్ర పూజలు అంగరంగ వైభవంగాజరుగు తున్నాయి. ఈ నెల ఏడో తేదీన అమ్మవారి జయంతి. ఈ నేపథ్యంలో తిరునక్షత్ర పూజలకు ఆదివారం నుంచి శ్రీకారంచుట్టారు.ఆలయ వంశపారం పర్య ధర్మకర్తపి.ఏ.ఆనంతా చార్యులు, ఆలయ కార్యనిర్వహణా ధికారి వడ్డాది సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు గోపాలచార్యులు, తహలీ స్వామి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రతిరోజుసాయంత్రం తిరునక్షత్ర పూజలు జరుగుతున్నాయి.ఇకఆదివారం అమావాస్య.ప్రతిఅమవాస్యకు స్వామివారి మూలవిరాట్టు కు అభిషేకం జరుగుతుంది. ఈ అభిషేకాన్ని స్వయంగా చూడటం పూర్వజన్మ సుకృతంగా భక్తులు భావిస్తారు. ఈ అభిషేక దర్శనం కోసం ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.గోదాతిరురునక్షత్రపూజలు వైభవంగా జరుగుతున్నాయని, ఈతిరునక్షత్రపూజల వైశిష్యత్తును ఆలయ అర్చకులు గోపాలాచార్యులు భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దాతల సహకారంతో అన్నదానకార్యక్రమాన్ని నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్త ఆనంతాచార్యులు పలువురు పాంచరాత్ర ఆగమ పండితులు విచ్చేస్తున్నారు.దీంతో ఉదయం, సాయంత్రం ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది.
తమిళనాడులోని శ్రీరంగంలో ఎలాంటి పూజలు కైంకర్యాలు చేస్తారో అదే విధంగా ఇక్కడ కూడా జరుగుతాయి.
దీంతో శ్రీరంగం వెళ్ళలేని రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు గోదా జయంతి ఉత్సవాల కోసం ఇక్కడకు తరలివస్తున్నారు. వచ్చిన వారందరికీ ఆలయ ఈవో ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసాద వితరణ జరుగుతోంది. ప్రతిరోజు ఉదయం బాలభోగం,చక్రపొంగలి, కట్టుపొంగలి, దద్దోజనంపెడుతున్నారు.
సాయంత్రం సెనగలు,దోసలు ప్రసా దంగాఅందిస్తున్నారు. ప్రసాదాల దేవుడిగా గుర్తింపు పొందిన లక్ష్మీనరసింహ స్వామిఆలయంలో ఏడో తేదీ వరకుఈఉత్సవాలు జరగనున్నాయి.

## శ్రీ సత్యదేవుని దర్శించుకున్న తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామివారి దర్శనార్థం తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శ్రీ స్వామివారి సన్నిధికి విచ్చేశారు. ముందుగా ఆలయ అధికారులు ఆలయ ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించుగా దేవస్థానం అధికారులు శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు.



## బస్ సర్వీస్ ఏర్పాటు సందర్భంగా ఆనందం వ్యక్తం చేసిన ప్రజలు



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన నాయకులు ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఏర్పాటు చేసిన ఏలేశ్వరం టు కాకినాడ (వయా.. ఏలేశ్వరం నుంచి బూరుగుపూడి, సోమరాయణంపేట, పాలెం, తామరాడ, రామచంద్రపురం,మర్లావ,కాండ్రకోట, సిరివాడ, గుడివాడ, పెద్దాపురం మీదుగా కాకినాడకు ఏర్పాటు చేసిన బస్ సర్వీస్ పట్ల గుడివాడ గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఆయా గ్రామాల నుంచి ప్రజలు,విద్యార్థులు పట్టణానికి రావాలంటేఆటోలను ఆశ్రయించవలసి వచ్చేదని, దీనితో పాటు గంటల కొలది నీరీక్షించవలసి వచ్చేదని వారు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు నూతన ఆర్టీసి బస్ సర్వీస్ ఏర్పాటుతో ఇబ్బందులు తప్పాయని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మన గుడివాడ గ్రూప్ సభ్యులు చాగంటి పరశురామ్, కోన వెంకట్రావు, ఈ బస్ కోసం కృషి చేసిన సామాజిక సేవకుడు బొడ్డేటి అప్పారావును, గ్రూప్ సభ్యులు, సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మండపాక తాతారావు, కనపర్తి సీతారామ్, కామిశెట్టి ప్రకాష్, నల్లంశెట్టి బుజ్జి, జ్యోతుల శివ, చాగంటి వరప్రసాద్, తాటికొండ గణేశ్వరరావు, అనంత, చాగంటి పెదకాపు, నల్లంశెట్టి మురళి, చాగంటి సుబ్రహ్మణ్యం, ఉప్పులూరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ సెంటర్ నందు విద్యార్థులకు ప్రయోగాలపై శిక్షణ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణం రామారావుపేటలో గల అల్లంరాజు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రియ అసోసియేషన్‌తో ఏర్పాటు చేసిన ఎసిటి సైన్స్ సెంటర్ నందు పదవ తరగతి విద్యార్థులకు రసాయన శాస్త్రంలో రసాయన సమీకరణాలు అనే పాఠ్యాంశంపైన సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ అనేక ప్రయోగాలు చేయించారు.ఈ తరగతికి సుమారు విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులకు జంతు వులతో ఎలా మెలగాలి, ఎలా రక్షించుకోవాలి, విష రహిత, విష పూరిత సర్పాలను ఎలా గుర్తించాలి, ప్రకృతిని ఏవిధంగా కాపాడుకోవాలి అనే విషయంపైన పట్టణానికి చెందిన జంతు ప్రేమికులు నవీన్ నాని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్, చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ, ప్రధాన కార్యదర్శి రొంగల అరుణ్, దారపురెడ్డి అఖిల తదితరులు పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
సోమవారం,
5 ఆగస్టు 2024



## గాంధీ నగర్ శాఖ గ్రంధాలయంలో 'చదవటం మాకిష్టం'



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ కుళాయి చెరువు పార్కులో గల గాంధీ నగర్ శాఖ గ్రంథాలయంలో ఆదివారం నాడు చదవటం మాకిష్టం కార్యక్రమం లో బాలసాహిత్యం పుస్తకములతో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయంలో గల బాల సాహిత్యం పుస్తకములను ప్రదర్శనగా ఉంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో అక్బర్ బీర్బల్ కథలు, అల్లావుద్దీన్ అద్భుతదీపం తదితర పుస్తకములు చదివించడం జరిగింది.

ఈ సందర్భంగా లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకతను గురించి తెలియజేసి, విద్యార్థులను గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాల్సిందిగా తెలియజేయడంజరిగింది. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ స్వాతి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ సత్య దేవుని దర్శించుకున్న దెందులూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ధర్మరాజు



అన్నవరం, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామివారి దర్శనార్థం దెందులూరు నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ స్వామివారి సన్నిధి విచ్చేశారు. ముందుగా ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు.

# సమాజానికి రోటరీ అద్భుత సేవలు

– ఆంజనేయమూర్తి

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** సమాజ అవసరాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని తీర్చడంలో రోటరీ క్లబ్‌లు చేస్తున్న సేవలు అద్భుతమని సీనియర్‌రోటేరియన్ పి.డి.జి కె.వి.యస్.ఆంజనేయమూర్తి అన్నారు. రోటరీ గోల్డేన్ జూబ్లీ క్లబ్ సమావేశంలో పాల్గొని మెంబర్‌షిప్ మరియు న్యూక్లబ్ డెవలప్‌మెంట్ మాసోత్సవాలను జ్యోతి వెలిగించి లాంచనంగా ప్రారంభించారు. అనంతరం సభ్యులను ఉద్దేశించి ఆంజనేయమూర్తి మాట్లాడుతూ గత ముదుదశ్దాలుగా రోటరీ భారీస్దాయిలో శాశ్వతసేవాకాక్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కాకినాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రారంభించిన రోటరీగోల్డెన్ జూబ్లీక్లబ్‌అనేకశాశ్వత ప్రాజెక్టులద్వారాసమాజానికి సేవలందిస్తోంద న్నారు. రోటరీ బ్లడ్‌బ్యాంకు ద్వారా లక్షలాదిమందికి ప్రాణదానం చేసారని గుర్తుచేస్తూ ప్రశంసించారు. తాము స్పాన్సర్ చేసిన ఈ క్లబ్ ద్వారా చేస్తున్న కార్యక్రమాలు రోటరీ డిస్ట్రిక్టులో ప్రత్యేక గుర్తింపు పొందడంగర్వకారణమన్నారు. పభ్యత్వనమోదుకార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా సూచించారు. కొత్తక్లబ్‌లు ఏర్పాటుచేయడం పైనా దృష్టిపెట్టాలని కోరారు. నీడ్ చేసే వెటర్నక్లబ్, సాటిలైట్ క్లబ్, కార్పొరేట్ సభ్యత్వం కల్పించడం తోపాటు యవతకు ప్రాధాన్యత ఇవాల్సిందిగా చెప్పారు. రోటరీలోకి కొత్త తరం రావాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.




సేవా కార్యక్రమాల నిర్వహణకు దాతల కొరతలేదని అందువల్లే నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు నిరంతరం సేవలు అదిస్తున్నారని వివరించారు. మన రోటరీ జిల్లానుండి అంతర్జాతీరోటరీకి పదిలక్షల డాలర్లు విరాళంగా అందించిన ఘనతదక్కిందన్నారు. సేవాకార్యక్రమాల నిర్వహణలో రోటరీ గోల్డెన్‌జూబ్లీ ఎల్లప్పుడూ ముందుంటుందని కొనియాడారు.

సమావేశానికి క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీకాంత్ అధ్యక్షవహించగా ముఖ్యఅతిథి ఆంజనేయమూర్తిని సభకు వెత్సా ఆనంద్ పరిచయంచేస్తూ




అయిదు దశాబ్దాలకు పై రోటరీసభ్యునిగా కొనసాగుతూ ఈ ప్రాంత రోటేరియన్లకు స్ఫూర్తిగానూ మార్గదర్శిగా వున్నారని అన్నారు. రోటరీలో అనేక ఉన్నత పదవులను అధిరోహించి వాటికే వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి దామెరశ్రీకాంత్, కోసాదికారి పి.స్వరూప్‌రాజు, డా॥.టి.వి.బాలకృష్ణ,నల్లమిల్లి మాచారెడ్డి, చోడిశెట్టి పద్దరాజు, జి.కె.శ్రీనివాస్,చార్మినార్‌వర్మ,దనసాగర్ ప్రసాద్, సత్తిరవిరెడ్డి, కోటగిరి నాని, తాళ్ళూరి శ్రీనివాసరాజు,బళ్ళసత్యపాల్, లంకసాయి బాబు,సోనిబుజ్జి తోపాటు పలువురు పాల్గొన్నారు.

## అనధికారంగా భాగ్యనగర్ గ్యాస్ పైప్‌లైన్ పనులు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో భాగ్యనగర్ గ్యాస్‌కు సంబంధించి అనధికారకంగా గ్యాస్ పైప్ లైన్ పనులను నిర్వహిస్తున్నారని సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు అన్నారు. సామర్లకోట పట్టణంలో భాగ్యనగర్ గ్యాస్ పనుల పేరుతో రోడ్లు ఛిద్రం చేయడాన్ని హరిబాబు ఆదివారం అడ్డుకున్నారు. గత నెల 31వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో సైతం భాగ్యనగర్ గ్యాస్ పైప్ లైన్ పనులపై కౌన్సిలర్‌లు అభ్యంతరం వ్యక్తం చేసారు. అంతకు ముందు నుంచే గ్యాస్ పైప్ లైన్ పనులు యదేచ్ఛగా జరుగుతున్న మున్సిపల్ అధికారులు అవి గ్యాస్ పైప్ లైన్ కాదని చెప్పడం విచిత్రంగా అనిపిస్తోంద న్నారు. అయితే అది భాగ్యనగర్ గ్యాస్ పైప్ లైనుగా పనిచేసే సిబ్బందే అంగీకరించారని కౌన్సిలర్ జరిబాబు చెప్పారు.

అయితే దీనిపై మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన ఆరోపించారు. మున్సిపాలిటీ నుంచి ఏ విధమైన అనుమతులు లేకుండా మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతూన్నారని ఆయన అన్నారు. ఈ పైప్ లైన్ పనుల వలన ట్రాపిక్‌కు సైతం తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, రోడ్డు మార్జిన్‌లు పాడవడం జరుగుతుందని హరిబాబు పేర్కొన్నారు. ఈ పనులపై అధికారులు స్పందించి పైప్ లైన్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ హరిబాబు కోరుతున్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వ్యవస్థ

**– 9.30కి డయల్ యువర్ కమిషనర్**

**– సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచన**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు 05.08.2024 సోమవారం ఉదయం పదిన్నర గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. స్థానిక శారదాదేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. అలాగే ఉదయం 9:30 నుంచి పదిన్నర వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేషన్ కార్యాలయ ఫోన్ నెంబర్ 0884-2357800కు సమస్యలు తెలియజేయవచ్చని కమిషనర్ సూచించారు. డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని కమిషనర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

## పెద్దాపురం డివిజన్‌లో వర్షపాతం వివరాలు

**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురం డివిజన్‌లోని 11 మండలాలలో ఆదివారం నమోదైన వర్షపాతాల వివరాలు. కోటనందూరు మండలం 0.0 మి.మీ., తుని 2.2 మి.మీ., రౌతులపూడి 0.0 మి.మీ., శంఖవరం 6.0 మి.మీ., ఏలేశ్వరం 37.2 మి.మీ., జగ్గంపేట 20.2మి.మీ., కిర్లంపూడి 18.2 మి.మీ., ప్రత్తిపాడు 17.4 మి.మీ., తొండంగి 17.2 మి.మీ., పెద్దాపురం 15.6 మి.మీ., గండేపల్లి 25.0 మి.మీ., వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

## అంబేద్కర్,జగజ్జీవన్ రామ్ విగ్రహాల పైకప్పు నిర్మాణ పనుల్లో మంత్రి శ్రమదానం

**యలమంచిలి,మేజర్‌న్యూస్ :** మండలంలో ఆర్యపేట గ్రామ అరుంధతి పేటలో డాక్టరు బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహాలపై కప్పు స్లాబ్ నిర్మాణ పనుల్లో రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు శ్రమదానం చేశారు. ఆదివారం ఆయన స్వయంగా స్లాబ్ నిర్మాణ పనుల్లో ఇసుక,కంకర గమేళా లను నెత్తి మీద పెట్టుకుని కార్మికులతో కలిసి మిల్లర్ లోవేశారు. స్లాబ్ ఎత్తు పైకి సెంట్రింగ్ కర్రలు పై నుంచుని కార్మికులతో కలిసి పనిచేశారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నియోజకవర్గంలో తొలిఅభివృద్ధి పనిగా గతంలో ఈ మహనీయుల విగ్రహాల స్లాబ్ నిర్మాణం పనుల్లో శ్రమదానం చేసి శ్రీకారం చుట్టారు. అప్పటినుంచి పనులు నడుస్తూ స్లాబ్ దశకు చేరుకున్నాయి. స్లాబ్ నిర్మాణ పనుల్లో శ్రమదానం చేసిన మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో మహనీయుల విగ్రహాల స్లాబ్ నిర్మాణాల్లో శ్రమదానం చేసి దాతలను భాగస్వాములను చేస్తామ న్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మదర్ థెరీసాల స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో ఏ ఆదరణలేని తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు, నిరుపేదలైన దివ్యాంగులకు గూడు కల్పించేందుకు దాతలు ముందుకు వస్తే శ్రమదానం చేస్తానని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి తహశీల్దారు బాజీ సత్యనారాయణ, యంపిడివో పి.శ్రీనివాస రావు, నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బొప్పన హరి కిషోరు,ఆరిమిల్లి రామ శ్రీనివాస్, తాడి శశిధర్, మాత రత్నం రాజు, చిట్టూరి సీతారామాంజనేయులు, పీతల శ్రీను, దొంగ నరసింహా కుమార్, కొడవటి వరబాబు, టిడిపి,జనసేన, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శాకంబరిగా వాసవి మాత

పెనుగొండ, మేజర్ న్యూస్:సకల లోకాలను పోషించే శక్తి స్వరూపిణి జగన్మాతను శాకాంబరీ దేవిగా ఆరాధించడం సాంప్రదాయం. పెనుగొండలోని శ్రీవాసవి శాంతి ధామ్ క్షేత్రంలో ఆదివారం వాసవి అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శిష్ట శేషగిరి మణికంఠ శర్మ, అర్చకులు సాయి సంతోష్ శర్మ వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించారు. ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మణికంఠ ధర్మ మాట్లాడుతూ శాకాంబరీ దేవి నీలవర్ణంలో సుందరంగా ఉన్న దేవి కమలాసనంపై కూర్చుని ఉంటుంది. తన పిడికిలి నిండా వరి మొలకలను పట్టుకొని ఉంటుంది. మిగిలిన చేతులతో పుష్పాలు, ఫలాలు, చిగురుటాకులు, దుంపగడ్డలు మొదలైన కూరగాయల సముదాయాన్ని ధరించి ఉంటుంది. ఈ శాకాల సముదాయం అంతులేని కోర్కెలను తీర్చే రసాలు కలిగి ఉంటాయి. జీవులకు కలిగే ఆకలి దప్పి, మృత్యువు, ముసలితనం, జ్వరం మొదలైనవి పోగొడతాయి. కాంతులను ప్రసరించే ధనుస్సును ధరించే పరమేశ్వరిని శాకాంబరీ, శతాక్షి, దుర్గ అనే పేర్లతో కీర్తింపబ డుతుంది.

## స్నేహితుల దినోత్సవ వేళ... పిఆర్‌జి హై స్కూల్ 1992 బ్యాచ్ రీ యూనియన్






కాకినాడ, రూరల్, మేజర్ న్యూస్ : స్నేహం మరియు వ్యామోహాల హృదయపూర్వక వేడుకలో, పిఆర్‌జి హైస్కూల్ 1992 బ్యాచ్ యొక్క పూర్వ విద్యార్థులు కాకినాడలోని రామ్‌కోసా హాల్‌లో 32 సంవత్సరాల స్నేహబంధాన్ని స్మరించుకోవడానికి ఆదివారం సమావేశమయ్యారు. ఈ వేడుక స్నేహితుల దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ పునఃకలయిక, భాగస్వామ్య జ్ఞాపకాలు మరియు పునరుద్ధరించబడిన బంధాలతో నిండిన సంతోషకరమైన సందర్భంగా పేర్కొన్నారు. 32 సంవత్సరాల తర్వాత పునఃకలయిక. పాత సహవిద్యార్థులు మూడు దశాబ్దాలకు పైగా తిరిగి కలుసుకున్నారు, వారి పాఠశాల రోజులను గుర్తుచేసుకుంటూ మరియు ఒకరి జీవితాలను తెలుసుకున్నారు. ఈ సంఘటన నవ్వులు, కథలు మరియు లోతైన కలయికతో వైభవంగా జరిగింది. కాకినాడలోని రామ్‌కోసా హాల్ ఈ నోస్టాల్జిక్ సమావేశానికి సరైన సెట్టింగ్‌ను అందించింది. కాలపరీక్షకు నిలిచిన చిరస్థాయి స్నేహబంధాన్ని చాటిచెప్పే బ్యానర్లు, అలంకరణలతో సభా ప్రాంగణం ముస్తాబైంది. హాజరైనవారు తమ పాఠశాల రోజులను తిరిగి పొందేందుకు అనుమతించే వివిధ కార్యకలాపాలతో రోజు నిండిపోయింది. వృత్తాంతాలను పంచుకోవడం నుండి పాత పాటలు పాడటం వరకు వాతావరణం ఆనందంతో నిండిపోయింది. అనేక మంది పూర్వ విద్యార్థులు వేదికపైకి తమ అనుభవాలను పంచుకున్నారు మరియు పిఆర్‌జి హైస్కూల్‌లో ప్రారంభమైన స్నేహానికి కృతజ్ఞతలు తెలిపారు. మరణించిన ఉపాధ్యాయులు మరియు సహవిద్యార్థులకు నివాళులు అర్పించారు, వారి జ్ఞాపకాలు పునరేకీకరణలో ప్రతిష్టాత్మకంగా ఉండేలా చూసుకున్నారు. జ్ఞాపకాలు హాజరైనవారు జ్ఞాపకాలు మరియు ఫోటోలు ఇచ్చిపుచ్చుకున్నారు, వ్యామోహ అనుభవాన్ని మరింత సుసంపన్నం చేశారు.

ఈ సందర్భంగా ప్రత్యేక స్మారక బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ "32 సంవత్సరాల తర్వాత నా స్కూల్ ఫ్రెండ్స్‌తో మళ్లీ కలవడం ఒక అధివాస్తవిక అనుభవం. సమయం నిలిచిపోయినట్లు అనిపిస్తుంది, మరియు మేము హాస్యాలు మరియు కలలను పంచుకుంటూ మా తరగతి గదుల్లోకి తిరిగి వచ్చాము. ఈ కలయిక పాత బంధాలను పునరుజ్జీవింపజేసి, మనం ఎంతో ఆదరించే కొత్త జ్ఞాపకాలను సృష్టించింది. ఎప్పటికీ. మరువలేని జ్ఞాపకాలు మిగిల్చింది."అంటూ భావోద్వేగానికి గురయ్యారు. పలువురు ఇదేవిధంగా తమ బాల్య స్మృతులను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు.

## ఉద్యానపంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం - 2023-24 సంవత్సరపు నిధుల విడుదల

**– కొత్తగా 3 వేల హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్ ఫాం సాగు చేసిన రైతులకి రూ.419 లక్షలు**

**– సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం కింద రూ.28.6లు విడుదల**

**– రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద రూ.78.75 లక్షలు**

**– 50 శాతం సబ్సిడీ పై హై బ్రీడ్ విత్తనాల పంపిణీ – కలక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** ఉద్యాన పంటల'కు ప్రభుత్వ పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశలో 2023-24 ఏడాదికి చెందిన నిధుల విడుదల చెయ్యడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. అందులో భాగంగా ప్రభుత్వం ఉద్యాన పంటల సాంగుకు తగిన ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. దీని కొరకు ఇటీవల 2023-24 సంవత్సరానికి సంబంధించి తూర్పు గోదావర జిల్లాలో నిర్దేశించిన భౌతిక లక్ష్యాలకు అనుగుణంగా రైతులకు అందచేయ వలసిన ఆర్థిక సహాయం రైతుల బ్యాంకు ఖాతాలకి జమ చేయుట జరుగుచున్నట్లు పేర్కొన్నారు. నేషనల్ మిషన్ ఫర్ ఆయిల్ ఫాం 2023 - 24 పథకం నందు జిల్లాలో కొత్తగా ఆయిల్ ఫాం నాటిన రైతులకు సబ్సిడీ తో కూడి ఆయిల్ ఫాం మొక్కలు పూర్తి రాయితీతో అందించడం జరిగింది. అందులో భాగంగా 3000 హెక్టార్లలో సాగు చేసేందుకు ఎరువుల నిమిత్తం వారి బ్యాంకు అకౌంట్లకు పిఎఫ్ఎంఎస్ ద్వారా జమ చేయుట జరుగుచున్నది. ఇప్పటి వరకు రూ.419 లక్షలు జమ అయినట్లు తెలిపారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం 2023-24 సంవత్సరంలో మామిడి, జీడిమామిడి, టిష్యూ కల్చర్ అరటి, ప్లాస్టిక్ మల్చింగ్, కోకో మొదలగు పంటలు సాగు చేయు రైతులకు రూ.28.6 లక్షలు సబ్సిడీ మొత్తం అందచేయుటకు నిధులు విడుదల చేయుట జరిగినదని కలెక్టర్ తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు రూ.18.87 లక్షలు రైతుల ఖాతాలకు పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా జమచేయుట జరిగినది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ఆర్కేవివై పథకం ద్వారా జిల్లాలో నెలకొల్పిన వివిధ ఉద్యాన పంటల సేకరణ కేంద్రం నిర్మాణానికి ఒక్కో సెంటరుకు రూ.5.25 లక్షల చొప్పున జిల్లా వ్యాప్తంగా 15 కలెక్షన్ సెంటర్లకు రూ.78.75 లక్షల నిధులు మంజూరు చేయుట జరిగినది. ఇంకా మిగిలిన రైతులకు మరొక విడతలో రాయితీ సొమ్ము అందించడం జరుగుతుందనీ కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

## మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న వేలాదిమంది భక్తులు



**– దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాట్లు**

**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి ఆషాఢ మాస జాతర మహోత్సవాల సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించబడుతున్నాయి.

దీనిలో భాగంగా ఆదివారం వేలాది సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకోవడం జరిగింది. దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్. రామ్మోహన రావు, ఛైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్ల ఏర్పాటు, క్యూలైన్‌లో భక్తులకు మంచినీటి సౌకర్యంతో పాటు,చిన్న పిల్లలకు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో పాలు పంపిణీ చేయడం జరిగింది. అలాగే శానిటేషన్ సిబ్బందితో దేవస్థానం ఆవరణలో మరియు పరిసర ప్రాంతాలలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడం జరిగింది. పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ సిబ్బంది ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని),రాయ విజయ్‌కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్,లోవ,శివ తదితరులు ఉన్నారు.

## ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరతారు..జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు జిల్లా పోలీస్ సిబ్బంది కుమారులు, కుమార్తెలుఉన్నత చదువులు ఐఐటి ఎంబిబిఎస్ బీటెక్ ఇంటర్మీడియట్ పదవ తరగతి లలో ప్రతిభ కనబరిచిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ వెల్ఫేర్ సంఘము నుండి రాబడిన నగదు, బహుమతి ప్రశంసా పత్రములను ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ అందజేశారు. ఆదివారం ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో గల సమావేశ మందిరంలో సమావేశము ఏర్పాటు చేసి విద్యార్థినివిద్యార్థులకు నగదు,ప్రశంసాపత్రములుఅంద చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాఎస్పీమాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఇష్టపడిచదువులుచదివితేఉన్నతశిఖరాలను చేరుకోవడా నికి నిదర్శనం మీరే అని,వీరిని మిగిలిన పోలీస్ కుటుంబాలు పిల్లలు ఆదర్శంగా తీసుకోవాలని, పోలీస్ పిల్లలు ఉన్నత శిఖరాలకు చేరుకుంటే ఆఆనందంతో పోలీస్ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తారని తెలిపారు. లిపోలీస్ సంక్షేమంలో భాగంగా ప్రధాన పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన 32 మంది పోలీస్ సిబ్బంది పిల్లలకు స్కాలర్ షిప్ మంజూరు చేశారు. విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత విద్యతోనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని, అందుకు తగిన విధంగా విద్యార్థులు శ్రద్ధ, క్రమశిక్షణతో తమ చదువులను కొనసాగించి, మంచిఫలితాలనుసాధించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్పీతో పాటుగా జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ జి స్వరూప రాణి, పోలీస్ ప్రధాన కార్యాలయం ఏవో నాయక్,జీ సెక్షన్ సిబ్బంది వైఎస్వి ప్రసాద్,ఎస్.బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు,పోలీసు పోలీసు అధికారుల సంఘము అధ్యక్షుడు నాగేశ్వరావు, పోలీస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మదుగులమ్మ జాతర ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజప్ప



**సామర్లకోట, మేజర్‌న్యూస్ :** సామర్లకోట పట్టణంలోని భీమేశ్వర ఆలయం వద్దగల మదుగులమ్మ ఆలయంలో జరుగుతున్న జాతర ఉత్సవాలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ఆదివారం ప్రారంభించారు. ఆలయ కమిటీ, రైతు నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన మదుగులమ్మ అమ్మవారి జాతర ఊరేగింపును కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం జాతరఉత్సవంపురవీదుల్లోరాత్రివరకూ కొనసాగించారు.

ఈ ఉత్సవాల్లో తెదేపా నాయకులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీశ్, వల్లూరి దొర, చంద్రు బలరామ్, బలుసు వాసు, ఆలయ కమిటీ నాయకులు, అర్చకులు, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఐ మౌనిక పెద్దాపురం స్టేషన్‌కు బదిలీ



**సామర్లకోట,మేజర్‌న్యూస్:** సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం మౌనిక పెద్దాపురం ఎస్ఐగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఏలూరు రేంజ్ ఉన్నతాధి కారుల నుంచి వచ్చిన సాధారణ బదిలీల ఉత్తర్వుల ప్రకారం సుమారు సంవత్సర కాలంగా సామర్లకోటలో ఎస్ఐగా మౌనిక పనిచేశారు. ప్రస్తుతం ఆమె పెద్దాపురం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కాగా ఆమె స్థానంలో ఎవరు ఎస్ఐగా వస్తున్నారనేది ఇంకా తెలియరాలేదు.

## స్వచ్ఛందంగా పచ్చగడ్డిని కోసి గోశాలకు తరలింపు



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** మండలంలోని హుస్సేన్ పురం గ్రామానికి చెందిన యువకులు రైతులు స్వచ్ఛందంగా గ్రామంలో పలు చోట్ల ఉన్న పచ్చగడ్డిని కోసి మినీ వ్యాన్‌పై కాకినాడలో గల గోశాలకు ఆదివారం తరలించారు. గతంలో కూడా ఇదే విధంగా గ్రామానికి చెందిన యువకులు గ్రామంలో ఉన్న పచ్చగడ్డిని కోసి గోశాలకు అందచేశారు. ఈ సందర్భంగా యువకులను రైతులను టీడీపీ నాయకులు చల్లా బుజ్జి అభినందించారు. తమ గ్రామం నుండి యువకులు రైతులు స్వచ్ఛందంగా గడ్డిని ఉచితంగా గోసాలకు అందచేయడం అభినందనీయమని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు తన వంతు సహాయ సహకారాలు అందచేస్తానని బుజ్జి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి రాజు,పుప్పాలనాయుడు,మార్ని వీర్రాజు, టేకుమూడి బూరయ్య, అయినాల కృష్ణ, మార్ని దుర్గారావు, పుప్పాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.